# దేవాలయంలో దేవుళ్లాటలు

[ఈవ్యాసకర్త 'ఆంధ్రభూమి' పాఠకులకు ఆదినుంచీ పరిచితుడు. మనోహరములైన వారి కథావ్యాసాలు పెక్కు ఈపత్రిక సంచికలలో ప్రచురితాలు ఐనాయి. ప్రస్తుతం ప్రచురితమగుచున్నది వ్యాసం. ఇందు వారికి సహజమైన సరళభాష, హాస్యప్రియత్వము, సంఘసంస్కరణాభిలాష సువ్యక్తమౌతున్నాయి. మనదేవాలయాల్లో పొడసూపే పెక్కు అనుచితవిషయాలకు ఈవ్యాసం ప్రదర్శనభూమి గావుంది. —సంపాదకుడు.]

రచయిత :

## పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.ఎ.

### చర్చి : గుడి

డిసెంబరు 25-వ తారీఖున అర్ధరాత్రి చర్చికి వెళ్ళి చూచాం. చెప్పతగ్గ విశేషమేమీ అక్కడ జరగలేదు. కాని మూడు నెలల అనంతరం విష్ణ్వాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మహా వైభవంగా జరుగుతున్నాయి. మాయింటి పక్కనున్న ఆదెమ్మగారు ఒకసారి వచ్చి "ఎప్పుడూ గదిలో కూచుని పోచికోలు కబుర్లు చెప్పకుంటూ ఉండకపోతే గుళ్లోకి వెళ్ళి చూచిరా కూడదు, నాయనా? ఎంత మందో వెళ్లుతోన్నారు. ఆ భక్తీ, ఆ సంగీతాలు చూడకపోతే ఎందుకు జన్మ!" అని ఇంకా ఏమేమో ఉత్సవాన్ని గురించి నోరూరేలాగు చెప్పింది. ఆనాటి రాత్రే మేం నలుగురమూ భోజనంచేసిన తర్వాత కిళ్లీలు నములుతూ, దేవాలయ ప్రవేశం చేశాం.

### 'ఆ అమ్మాయి ఎవర్రా?'

ఏం జనం! ఏం జనం! పుట్టపగిలి చీమలు పారకాడినట్టు దేవాలయపు ఆవరణలో జనసమ్మర్దము జాస్తిగా ఉంది. వెళ్ళేవాళ్ళు, వచ్చేవాళ్ళు, నిల్చి చూచేవాళ్ళు— ఎంతో కోలాహలంగా ఉంది. ముగ్ధబాలికలు గడుసు యువకుల సందిళ్ళలో నలుగుడు పడుతున్నారు. మరికొన్ని చోట్ల కొందరు పాపభీరువులైన మగవారు నెరజాణల ఉరోజాల తాకిడికి మనస్సు కలతజెంది 'హరి, హరి,' అనుకుంటున్నారు. 'ఏం పోగాలం వచ్చింది నాయనా? అంత మీదిమీదికి వచ్చి పడతావేం' అనే కోపఘూర్ణిత వాక్యాలు కొంతమంది స్త్రీలనోటి నుండి వెలువడుతున్నాయి. 'ఆ అమ్మాయి ఎవర్రా?' అనేటువంటి ప్రశ్నలు కొంచెము తగ్గు స్థాయిలో పక్కనున్న మిత్రులకు వేయబడుతున్నాయి.

### పిలకశాస్త్రి

మేము నలుగురమూ తిన్నగా మందలో జొరబడ్డాం. పిలకశాస్త్రి బలే ఉత్సాహంలో ఉన్నాడు. జనసమ్మర్దము అధికంగా ఉన్న చోట్లల్లో ప్రవేశించినప్పుడతని నరాల్లో ఉద్రేకం పొర్లువారుతూంటుంది. పద్మవ్యూహాన్ని భేదించుకుపోగల శక్తి ఒక్క అభిమన్యుడికే ఉంది, జనసమూహాన్ని చొచ్చుకుపోగల ప్రజ్ఞ పిలకశాస్త్రికే ఉంది. మంగళగిరి, కోటప్పకొండ తిరుణాళ్ళ రోజుల్లో; మస్తాను ఉరుసునాడు ప్రజాబాహుళ్యముతో క్రిక్కిరిసి ఉండే బెజవాడ బుక్కింగు ఆఫీసు దగ్గరకు అతి సునాయాసంగా వెళ్ళి టిక్కెట్టు కొనుక్కువస్తాడు. అతని ఆసరా చూచుకునే తెలుగుఫిలిం వచ్చిన మొదటిరోజునే మేము సినీమాకు వెళ్ళగలుగుతున్నాం. పట్నంలో ఏమూల ప

పోట్లాట జరుగుతూ నలుగురు మూగినా, అక్కడ తప్పకుండా మన శాస్త్రిణః ఉండవలసినదే. ఇంతకూ చెప్పవచ్చిన దేమంటే: తేనెతెట్టెమీది ఈగలవలె దట్టముగా తత్ ప్రదేశాన్ని ఆక్రమించి ఉన్న జనాన్ని చూడ్డంతోనే పిలకశాస్త్రి మహోత్సాహపూరితుడై, ముందు తాను తోవచేస్తూ, మాకు నాయకత్వాన్ని వహించాడు.

### ఆడపిల్ల జడలాగి

లోపలికి వెళ్లుతోన్నకొద్దీ అనేక విచిత్రాలు కనిపించుతూ వచ్చినై. ముఖ్యంగా బడిపిల్లలు కొంతమంది చేస్తోన్న అల్లరి చాల హాస్యజనకంగా ఉంది. ముందు నడుస్తోన్న ఒక పురుషుని ఉత్తరీయపు కొంగూ, ఒక యువతి పైటకొంగూ ముడిపెడుతున్నాడు ఒక గుంటడు. పోతూపోతూన్న ఒక ఆడపిల్ల జడ పట్టుకుని లాగి, ఆ అమ్మాయి వెనక్కు తిరిగిచూచేలోపుగా తానేమీ ఎరగనట్టు పక్క స్నేహితుడితో ఎంతసేపటినుంచో, ఏదో ముఖ్య విషయాన్నిగూర్చి మాటల ధోరణిలో ఉన్న కవళిక ప్రదర్శిస్తాడు ఒక పెద్దబ్బాయి. సందు దొరికినప్పుడల్లా ఒక బడిద్ధాయి చేతిలోని రబ్బరుస్టాంపుకు సిరా అంటించి రవికలమీదా, చొక్కాలమీదా కొన్ని విపరీతార్థంగల మాటలను ముద్రించుతున్నాడు ఇలా ఉంది కుర్రవాళ్ళ మర్కటత్వం.

### బర్మాముడికాదని వాలుజడ

గుంపంతా ఒకసారి కలయచూస్తే ముప్పాతిక భాగం స్త్రీలే కనిపిస్తారు. పాపం! అవమానమంతా వాళ్ళకే జరుగుతోంది. గృహద్వారం దాటి బైటికి రావలసిన అవసరంలేని ఈస్త్రీలకు గుళ్లో హరికథో, పురాణమో, ఉత్సవమో జరుగుతోందనే వార్త అమృతోపమానంగా చెవిని బడుతుంది. బంధమోచనము పొందబోయే ఖైదీలకువలె వాళ్ళ హృదయాల్లో ఆనందము తొణుకుతుంది ఇంకేం? కనీసం నాలుగైదుగంటలు ముస్తాబుకోసం ప్రత్యేకించుకుని సమ్మోహనాస్త్రాలులాగా తయారౌతారు. శయనాగారంలో భర్తవద్దకు వెళ్ళేటప్పుడుగూడా సింగారింపు విషయంలో కొంత అశ్రద్ధ ఉండవచ్చునేమోగాని, ఇల్లు బయలుదేరవలసి వస్తే మాత్రం స్త్రీలకు ఎక్కడాలేని కళాదృష్టి అబ్బుతుంది. గళ్ళచీర కాదని పువ్వుల చీర, బర్మాముడి కాదని వాలుజడ, కాసులపేరు కాదని ఎస్ గొలుసు, —ఎంతో తర్కం అయేసరికి బ్రహ్మదేవుడు బహిర్భూమికి వెళ్ళివచ్చినంతకాలం పడుతుంది. అందుకనే ఆడవాళ్ళతో సినిమాకు వెళ్దామంటే ఎప్పుడూ సకాలానికి అందుకోలేము. వాళ్ళతో ప్రయాణం పెట్టుకున్నామంటే మన అదృష్టవశాత్తు రైలుబండి ఆలస్యమైతే తప్ప అందటం దుస్తరం.

### పొట్టిచేతుల జాకట్లు

కాబట్టి గుడిలో హాజరైన మహిళామణులు అనేక తరహాలుగా ముస్తాబై ఉన్నారని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. కృష్ణుడితో రాసక్రీడ లాడిన గోపికలు, మహామునుల తపోభంగానికి కారణభూతలైన ఊర్వశీ మేనకాది అప్సరః కాంతలు, నేటి ఆంధ్ర సినీమాలోకంలోని అభినేత్రులు జ్ఞాపకం వచ్చేలాగు ఉన్నారు. ఆ వాల్జడలు— ఆపూలచెండ్లు — వలెవాటు పైభాగాన్ని కుంచించి వక్షస్థలపు ఔన్నత్యాన్ని ప్రస్ఫుటం చేస్తోన్న ఆ పైటపిన్నులు—జబ్బలమలుపు ప్రదర్శిస్తోన్న ఆ పొట్టిచేతుల జాకెట్లు—అన్నీ పురుషహృదయాలపాలిటి అయస్కాంతాలయిపోయినై. సాహసులైన యువకులు వెంటబడ్డారు. పవిత్రత, భగవద్భక్తి ఉజ్వలమై ఉండవలసిన దేవాలయంలో మోహతృష్ణ వెలిగక్కుతూన్న పురుషుల ముఖాలూ, స్త్రీలకు జరుగుతోన్న అవమానాలూ కనిపిస్తున్నై.

### స్త్రీల సౌందర్య ప్రియత్వం

ఎవరిది తప్పు! స్త్రీలు అంత మధురంగా సింగారించుకోవడమూ, సహజంగా సౌందర్యవతులై ఉండటమూ అపరాధంగా ఎంచేవాళ్లు సంకుచిత చిత్తులే అనాలి. కేవలం పురుషుల్ని ఆకర్షించేందుకే వాళ్లు అంతగా శృంగారించుకుంటూ రని చెప్పటానికి సాహసించలేము. అట్టి

వారు కొంతమంది అల్పసంఖ్యాకులు ఉండవచ్చు. వాళ్ళసంగతి అటుంచి సర్వసాధారణంగా ఆలోచిస్తే—స్త్రీలకు సౌందర్యప్రియత్వం ఉగ్గుపాలతో వచ్చిన నైజగుణం. గృహాలంకరణాలలో, ప్రాంగణములందు ప్రాతఃకాలాన రచింపబడే ముగ్గులలో, ఆఖరుకు తమ కట్టులో బొట్టులోకూడా వాళ్ళ సౌందర్యోపాసన అభివ్యక్తమాతూంటూంది.

## పువ్వుల్ని కోరే పువ్వుబోడులు

పువ్వులంటే వాళ్ళకెంత ప్రేమో చూడండి. తండ్రిగాని, అన్నగారుగాని బజారుకు వెళుతోన్నప్పుడు ఆడపిల్ల తరచుగా ఏమికోరుతుంది? పువ్వుల్ని. ఆడపడుచులు బడికి పోతూ మధ్య దారిలో ఏ పున్నాగ చెట్టో ఉంటే, అక్కడ పువ్వులేరుకుంటూ తన్మయలై పోతారు. సౌకుమార్యానికీ, మార్దవమునకూ, పవిత్రతకూ, పరామోదకరమైన జీవితమునకూ తావలమైన సుమనోరాజిని శిరస్సుల దాల్చి మన్నించుతోన్న గుణవతులు స్త్రీలంటే. అట్టి వాళ్ళను పురుషుడు తన క్షణిక- వ్యామోహ- నుశ్చేష్టితాలతో అవమానించడ మతనిదే తప్పు. తన మనస్సు చలించటానికి వాళ్ళ ఆకర్షకమైన సింగారింపే కారణంగా చెప్పేవాడు ఏమంత స్థిరచిత్తుడు? నవరసాల్లో అగ్రగణ్యమైన శృంగారరసానిక అధిష్ఠానదేవత స్త్రీ అయినప్పుడు ఆమె సింగారించుకుంటుంది, తప్పులేదు. హావభావ విలాస విభ్రమాలతో పురుషులను ఆకర్షించడమే ప్రధానోద్దేశంగా ఉండే యువతులు కొంతమంది ఉండవచ్చును. కాని స్త్రీజాతి నంతా ఆ తరగతిలోనికే చేర్చడం పెద్ద పొరపాటు.

## బాలికల చిత్తములు

అసలు మన మగవాళ్ళకు స్త్రీలంటే గౌరవాదరణాలు లేవని చెప్పడం సత్యదూరమైన మాట కాదు. సుమతీశతకంలో చిన్నప్పుడు "కోమలినిజమున్, తెల్లనికాకులును లేవు తెలియర" అని చదువుకున్న పద్యం మొదలుకుని నైషధంలో "చెప్పెడిదేమి? బాలికల చిత్తములంబుతరంగలోలముల్" అని గడ్డాలు, మీసాలు వచ్చాక చదువుకున్న పద్యంవరకూ స్త్రీలయెడ మనలో సద్భావాన్ని మొలకెత్తించే సారస్వతం చాల కొద్ది. విక్రమార్క-చరిత్ర ప్రారంభం చేసిన సంస్కృతవిద్యార్థికి మొగటి సర్గలోనే "క్షణోనాస్తి, రహోనాస్తి. నాస్తి ప్రార్థయితాజనః, ఇదం నారద! నారీణాం పాతివ్రత్యాయ కల్పతే" అనే శ్లోకం తగులుతుంది. అంటే— అవకాశమూ, రహస్యస్థలమూ, కోరేపురుషుడు లేకపోవడముచేతనే స్త్రీలు పతివ్రతలనిపించుకో గలుగుతారు అని ఆశ్లోకానికి భావం. ఆ మాటన్నా సందర్భపడే పక్షంలో ఏ స్త్రీకూడా పతివ్రతగా ఉండలేదు అని తేలుతున్నది. ఇలాంటి శ్లోకం విద్యార్థిహృదయంలో పునాది రాయిగా ఉండిపోతుంది. పెద్ద పెరుగుతూన్నకొద్దీ వాడు దానిమీద స్త్రీని గురించి ఎలాంటి భావసౌధాన్ని కట్టగలుగుతాడో ఊహించుకోవచ్చు. "స్త్రీబుద్ధిః ప్రళయాంతకః", "భార్యా రూపవతీ శత్రుః", "సుందరం పురుషం దృష్ట్వా యోనిర్ద్రవతి నారీణాం" ఇత్యాది అసంఖ్యాకములైన సామాన్యోక్తులు పురుషులకు స్త్రీ సౌశీల్యంలో ఏమాత్రమూ నమ్మకం లేదనే సత్యాన్ని చాటుతున్నై.

## విద్యావంతుల జంతుదాహం

అదిగాక—లౌకికమైన ఆంగ్ల విద్య అభ్యసించడం చేతనో, లేక స్వబుద్ధివికాసమో—కొందరు నవయువకులు విపరీతములైన, జంతుదాహాన్ని ప్రబోధించుతోన్న సిద్ధాంతాలను నిర్వచించుతున్నారు. అవి అంటుజాడ్యాలవలె అవ్యాహతంగా వ్యాపించిపోతున్నై. లోకంలో ఉన్న స్త్రీలనందరినీ ఒక్కొక్కతెను చొప్పున పొందుతూ పోవటమే ఆత్మవికాసానికి ఏకైక మార్గమనీ—స్త్రీతో ఐక్యమైనప్పుడే కొత్త ప్రాణిని పుట్టించబోయేటప్పుడు స్రష్టకు కలిగేటటువంటి ఆనందం కలుగుతుందనీ—ఇలా ఉంటై వాళ్ళ ఉద్దేశాలు. స్వచ్ఛందంగా ప్రవహించవలసిన ప్రేమకు వివాహమనేది ఒక అవ-

రోధమని వారు చెబుతారు. కాని సృష్టి చేయగలంత శక్తిని కలిగి ఉన్న ఓజస్సును ఎంతో విలువైన పదార్థంగా తెలుసుకుని, దాన్ని ఎంత జాగ్రతిగా ఖర్చుచేసుకోవాలో గమనించాలి ఆ పెద్దలు. పురుషుడికి ప్రాణమైన ఆ ఓజస్సును తనలాంటి మరొక జంతువును సృష్టించేందుకు ఉపయోగించడంలో ఉన్న సంరంభసమ్మిళితానందం కంటే—చక్కని కళాసృష్టికిగాని, మానవసేవకుగాని, వినియోగించినప్పుడు, వేయిరెట్లధికమైన పవిత్ర- నిశ్చల- నీరంధ్రామోదము కలుగుతుంది. పొట్ట డొక్కల కంటుకుపోయి, మోకాలు దిగని చింకిపాతతో, దరిద్రదేవతా పీడితుడై ఉన్న నిర్భాగ్యుడికి ఒకింత సానుభూతి చూపినప్పుడు కలిగే ఆత్మానందము ముప్పైమంది ముగ్ధలను కావిలించుకున్నా చేకూరదు.

### అందకత్తె వాలుచూపు

ఇంతకూ మానవజీవితంలో బ్రహ్మచర్యం విధిగా అనుష్టితము కాకుండా ఉండటమే పురుషులకు స్త్రీలంటే అట్టి దురభిప్రాయాలు కలగడానికి ముఖ్యకారణం. ఒక అందగత్తె వాలుచూపుకు, ఒక విలాసిని హంసనడకకు, ఒక చంద్రవదన ముంగురుల నాట్యానికీ, ఒక సురదన మందహాసానికీ, ఒక నీలకైశిక వాల్జడ అందానికీ, ఒళ్ళు మరుపు తగిలి, కామతాపము ప్రకోపించి, పౌరుషం నశించి వాళ్ళకు దాస్యంచేసి, వాళ్ళ పాదాలమీద నుదురు మోపి, పెంపుడు కుక్కలై, చివరకు ఎప్పుడో తమ్ము తాము తెలుసుకుని స్త్రీలు వట్టి మాయలాడులు, హంతకులు అంటూ లోపలి రోషమంతా వెళ్ళగక్కుకుంటే ఏం లాభం? పురుషుడంటే ప్రేమ. స్త్రీ శక్తి. శక్తి ప్రేమనుంచి ఉద్భవించింది. చివరకు శక్తే ప్రేమలో లీనమైపోవాలి. ప్రేమ శక్తికి దాస్యం చేయడం అస్వాభావికం. "ప్రపంచంలోని స్త్రీజాతి అంతా కలిసికూడా ఒక్క నిమిషంసేపైనా నా నిశ్చలత్వాన్ని భంగ పరచలేదు" అని ధైర్యంగా పలికిన నెపోలియన్ మన కాదర్శప్రాయుడు.

### కాంతాజ్వాలకి ఆశావాయువు

సౌందర్యవంతమైన వస్తువు మనకు ఆనందం చేకూరుస్తుంది. కామాన్ని రేపితే మన జంతుప్రకృతి ప్రకోపించిందన్నమాట. కామించి తన ఆకలికీ, దాహానికీ, సౌందర్యాన్ని బలిగొనేవాడు రాక్షసుడు. సౌందర్యాన్ని పూజించడం, గౌరవించడం నేర్చుకోవాలి. పాశ్చాత్యదేశాలువెళ్ళి డిగ్రీలు తెచ్చుకున్నా, సారస్వతక్షేత్రంలో పేరుప్రతిష్ఠలు పొందినా, ధనవంతుడైనా, ఉన్నతపదవిలో ఉన్నా లభించే ప్రజాదరణ కృత్రిమమైనది. కామి కానప్పుడే అతనికి స్వచ్ఛమైన, అచలమైన కీర్తి దొరుకుతుంది. కాబట్టి దారినబోయే ప్రతి ఆడుదాని వెంటాపడి, దగ్గి, సకిలించి, నానా అవస్థాపడి, హృదయంలోని కాంతాజ్వాలల్ని ఆశావాయువుతో మండించుకుంటూ, అత్యాచారానికి పూనుకోవడం మానివేసి మగవాడు స్త్రీలను లోకమాత యవతారాలనుగా చూడగలిగినప్పుడు దేశసౌభాగ్యం! వీధుల్లో ఒంటిగా నడచి వెళ్ళడానికే కాక, స్వేచ్ఛగా ప్రయాణాలు చేయడానికి కూడా స్త్రీలు నేడువలె జంకుచూపని రోజులు రావాలి. మన యువకులు జాగ్రఫీ, సైన్సులతోపాటు నైతికవిజ్ఞానంకూడా పాఠశాలల్లో నేర్చుకోవాలి; "ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ సంపత్తు తాండవిస్తుంది" అనే సూక్తిలోని సత్యాన్ని చూడాలి......

ఇలాగ ఒకచాలూ, మూలూ లేకుండా—కప్పదాట్లవలె ఉన్న ఆలోచనలలో నడుస్తున్నాను మిత్రులవెంట ఆజనసమ్మర్దనంలో. ఇంతలో ఒకతమాషా జరిగి, నా మనస్సు అటు ఆకర్షింపబడినందువలన ఆ ఆలోచనలకు ఆశ్వాసాంతమయింది.

### పొర్లివచ్చిన వెర్రి ఆవేశం

పిలకశాస్త్రి—జనసమూహాన్ని చూచినప్పుడు ఉద్భవించిన వెర్రి ఆవేశం క్షణక్షణానికీ శతగుణాధిక మౌతూడుంటే లోపల అణచిపెట్టుకోలేక పోయినాడు. అది కొంతవరకు బైటకు పొర్లి ప్రవహింపక

తప్పిందికాదు. అతనికి ముందుగా ఒక దాక్షిణాత్యుడు బాగా పెరిగిపోయిన బొజ్జతో జనాన్ని తోసుకుంటూ, తోవ చేసుకుని నెమ్మదిగా వెళ్ళుతున్నాడు. వెనకనుంచి చూస్తే ఒక పెద్దకోడిగుడ్డు ఆకారంలో ఉన్నాడు మనిషి. నడినెత్తిన పిడికిలంతముడి ఆకాశంవేపు పైకి సూటిగా చూస్తోంది, అంతవరకు ఏ అయ్యరూ వెళ్ళి కాఫీహోటలు పెట్టకుండా ఉన్న గోళమేదైనా ఉందేమో వెళదాం అన్నంత ఆప్యాయంగా. చొక్కా లేకపోవడం చేత—ఎంత కష్టానికైనా ఆగగలంత శరీరపు గట్టితనం, సాంబారు భోజనంవల్ల అబ్బిన నునుపూ స్ఫుటంగా ప్రకటితమౌతున్నై. ఆ పెద్దమనిషిని చూచినప్పుడు పిలకశాస్త్రి చిలిపితనంగా

"మేత కరిపిల్ల, పోరున మేకపిల్ల,
పారుబోతుతనంబున పందిపిల్ల,
ఎల్లపనులను చెరుపంగ పిల్లిపిల్ల,
అందమున కోతిపిల్ల యీఅరవపిళ్ళ."

అనే పద్యాన్ని ఆయన చెవ్వల్ని ఆకర్షించేటంత బిగ్గరగా, రాగయుక్తంగా చదివి, ఒక మహావీరకార్యం చేసినవాడువలె భావించుకుని, అందుకు మా అభినందనవిలోకనాలకోసం మా వేపు తిరిగి చూచాడు చిరునవ్వుతో.

గండుముఖంమీద కోపచిహ్నాలు.

తమిళ దేశస్థుడికి బాగా కోపం వచ్చేసింది. ఒళ్ళు తెలీకుండా అయిపోయాడు. పద్యం వినడంతోనే వెనక్కు తిరిగి, కనుబొమల్ని కుంచించి తీక్ష్ణంగా చూచాడు మా మిత్రుడివైపు. అసలే గండు ముఖం. అందులో కోపచిహ్నాలు అంకితమై ఉన్నై. విశ్వనాథం మాత్రం చాల జడిసి పోయాడు, ఒక మహా సంగ్రామం జరుగబోతోందని.

అదురుతోన్న పెదవులతో అరవాయన అన్నాడు పిలక శాస్త్రినుద్దేశించి: "ఎన్నరా అది! తిరిగి సొళ్ళు! బుద్ధి ఇల్లా? దెబ్బ పడాలా?"

తిన్నయింటి వాసాలు

అరవం, తెలుగు కలసి ఉన్న ఆయన వాగ్ధోరణి మా పిలక ప్రభువుకు చిక్కుడుకాయ, వంకాయ కలిపివండిన కూరవలె చాల రుచ్యంగా ఉందిగాబోలు! ఒకసారి చప్పరించి, ఏమాత్రమూ జంకు చూపకుండా అన్నాడు: "ఇదిగో, మిస్టర్ అయ్యర్ సాబ్ జీగారూ! నీ వలాగ గుడ్లెర్రచేసినంత మాత్రాన నాకు వెంట్రుకకూడా కదలదు. మీ దాక్షిణాత్యుల బలపరాక్రమాలు బాగానే ఎరుగుదుములే. బతుకు తెరువుకోసం మా దేశం వచ్చి మమ్మల్నే ఎదిరించుతున్నావే! తిన్నయింటి వాసాలు లెక్క పెట్టేజాతి మీది. జాగ్రత! ఆంధ్రులంటే ఏమిటనుకున్నావో?"

"తెరియం, బాగాదా తెరియం. ఇతరులను అనుకరించటం—కోతులు."

కొట్టబోయేటంత హంగామా

"కోతులు, గీతులు అన్నావంటే మూతి పగిలిపోతుంది జాగ్రత! నీవూ పందికొక్కువు. నీ భాష చచ్చుభాష. నీ కూడు నీరసమైనది. నీ దేశంలో అనాగరికత. నీ ఫిలిములు రోత. నీ పాట తలతిప్పుళ్లూ, మూతివంకరలూ. మీ—'

'ఎన్నారా అది? అంత దూషణ' అన్నాడు అయ్యరు—నీకు పిచ్చా, ఉన్మాదమా, తలతిక్కా? దారినబోయే వాళ్ళలో నిష్కారణంగా తగాదా పెట్టుకుంటావేం! అని అడుగుతోన్న చూపులతో.

'మాటలు తిన్నగా రానీ, రా, గీ అన్నావంటే తెలుసునా!' అని ఉరిమేడు మా పిలకశాస్త్రి.

'ఏమిదా చేస్తువు?' అని మొండి జవాబు.

'ఏమిచేస్తానా? చూడు!' అంటూ పిలకశాస్త్రి మొఖాన్ని ఎఱ్ఱబడేసుకుని, గుడ్లురిమి, నడుము విరిచి, దబదబా కుడిచేతిమీది చొక్కాను పైకితీస్తూ కొట్టబోయే అంత హంగామా చేస్తున్నాడు.

కోపంవచ్చినా తమాయింపు

ఈనాటకమంతా చూస్తూ నేనూ, రామారావూ ఒకర్నొకరం చూచుకుని నవ్వుకున్నాం—మన పిలకనాథుడు ఎక్కడికివచ్చినా సున్నపు పిడతరకం; గిల్లి కజ్జా పెట్టుకుంటాడు అన్నట్టుగా విశ్వం మా

త్రం భయభ్రాంతుడై గుడ్లు వోప్పజెప్పి చూస్తున్నాడు యోధులిద్దరికేసి. మానవసహజమైన కుతూహలంతో కొంతమంది మాచుట్టూ మూగి వాగ్వాదం వింటున్నారు. ఇంతలో—

అయ్యారును కొట్టటానికి ఉద్యుక్తుడౌతున్నట్టు మహానటన చేస్తోన్న పిలకశాస్త్రిని సాంత్వనపరుస్తున్నట్టుగా రామారావు ప్రారంభించాడు :

“ఇదిగో, శాస్త్రీ! పాపం, ఆ పెద్దమనిషితో ఎందుకు పోట్లాట, పద! మనిషన్నవాడు కోపంవచ్చినా తమాయించుకుని శాంతపడాలి మరి. అంత కోపమైతే ఎలాగ?”

### తెలుగుదేశాన్నిదోచే అరవలు

పిలకశాస్త్రి ఇంకా ఎక్కువగా కోపాన్ని నటించుతూ, “రామారావూ? నీకు తెలీదు; నీ విప్పుడు అడ్డంరాకు. అయ్యర్లంటే నాకు ఒళ్లు మండిపోతోంది. వర్తకమంటూ వచ్చి ఇంగ్లీషువాళ్ళు మన దేశం కాజేసిన మాదిరిగా ఈతమిళులు కాఫీహోటళ్ళు పెట్టుకునేందుకని ప్రవేశం సంపాదించుకుని మన ఆంధ్రరాష్ట్రాన్ని వాళ్ళరాష్ట్రంలో కలిపేసుకున్నారు. మన రాష్ట్రంమీది ఆదాయంలోకూడా కొంతభాగం వాళ్ళకే హక్కుభుక్తమై పోతోంది. ఉద్యోగాలన్నీ వాళ్ళవే. ఆశ్చర్యం వేస్తుంది, ఏ స్టేషన్‌లో చూచినా అరవం, తెలుగూ, ఇంగ్లీషు—మూడు భాషలూ, ఎలుకలు కిచకిచలాడినట్టు, మాట్లాడుకుంటూ, గూడకట్లతో, గోష్పాదకేశబంధచిహ్నిత శీర్షాలతో వాళ్లే కనిపిస్తారు. మన దేశంలోబడి తినమరిగి, మరీ అన్యాయమైపోయింది వీళ్ళ ఆగడం.” అంటూ ఏమిటేమిటో నోటికివచ్చినట్టల్లా తడువుకోకుండా వాగేశాడు.

### ఆంధ్రాజర్మన్‌లకు అరవజెక్కులు

ఈ తమాషా అంతా చూచేందుకుగా మాచుట్టూ మూగుతోన్న జనులసంఖ్య ఎక్కువై పోతోంది. నాకు కడుపు చక్కలయ్యేట్టుగా వస్తోన్న నవ్వును బలవంతంగా ఆపుకుని అయ్యరుగారిని సమీపించి “మీకెందుకు, పోండి సాబూ! మావాడంతే లేండి. అలాగే వాగుతూంటాడు. స్వభావం పాపం!” అంటూ ఆయన్ను అతిప్రయత్నంమీద మరలించాను.

పిలకశాస్త్రి అప్పటికైనా ఊరుకోకుండా, ‘మా ఆంధ్రరాష్ట్రమే వేరు కానీయండి చెబుతాను. జర్మనులు జక్కులను వెళ్ళగొట్టినట్టు మిమ్మల్నందర్నీ మా పొలిమేర అవలికి గెంటేస్తాం’ అంటూ బడాయిగా అరిచాడు.

### నిముషంలో ఎంతరభస

ఆ మాటకు అయ్యరుగారు ఒకసారి వెనక్కుతిరిగి ఏమిటో అనబోయాడు కాని నేనాయన్ను సాంత్వనపరుస్తూ ముందుకు నడిపించుకు పోయాను.

ఆయన్ను విడిచి నేను తిరిగి మా స్నేహితుల్ని కలుసుకున్నాను.

ఒక పెద్దనవ్వు అరగంటసేపు ప్రదర్శించి స్వోత్కర్ష ఆరంభించాడు: “చూచారుగా, అతగాణ్ణి మూడు నిమిషాల్లో వొణికించి పారేశాను. మొదట పొగరుబోతుతనంగా మీదికి వచ్చాడు గాని చివరకు భయపడిపోయాడు. నేను తీవ్రంగా మాట్లాడుతున్నప్పుడూ, కొట్టబోయేలాగు నటించినప్పుడూ, జంకుతూ వెర్రిచూపులు ఎలా చూచాడో మీరు గమనించలేదూ! పాపం! నిజంగా కొట్టేస్తాననే అనుకున్నాడు మానవుడు.” ఈధోరణిలో ఇంకా చాలా చెప్పాడు.

ఇప్పటికి భయమంతా తీరిపోయిన విశ్వం “ఎంత రభస చేశావోయి నిమిషంసేపులో” అంటూ శాస్త్రిజీ వీపుమీద చేత్తో తడివాడు.

### దీపాలు ఆరిపోయాయి

“ఇకచాలు గదికి పదండి. ఇంకా ఉన్నామంటే మన పిలకనాయకుడు మరికొన్ని కజ్జాలు ఈ ఉద్రేకంలో పెట్టుకోకుండా ఉండలేడు. ఎవడేనా ఇంతకంటే గడుసువాడు సంభవించాడంటే నాలుగు చపేటాలు మరీ ఇచ్చుకుని బుద్ధి చెబుతాడు. ఈయనతో ఉన్నందుకు మనకు కూడా తగులుతై. పదండి గదికి” అన్నాడు రామారావు కేవలం శాస్త్రిని ఉడికించటానికి.

శాస్త్రి అందుకు సమాధానంగా ఏమో చెప్పబోయాడుగాని—

దేవాలయపు ఆవరణనిండా ఉత్సవం కోసమని రచించబడిన విద్యుద్దీపాలన్నీ ఒక్కసారి ఆరిపోయినై. అంతా చీకటిమయమైపోయింది. నాటకశాలలో ఎంతసేపటికీ తెర ఎత్తకపోతే ప్రేక్షక మహాజన సమూహంలో చెలరేగే అరుపులు, చప్పట్లు, ఈలలూ, అక్కడా వినిపించినై. తోపుడు మహా ఎక్కువైపోయింది. హైడ్రాలిక్ ప్రెస్ లోని దూదిబేళ్ళలాగు అయిపోతున్నాం మేము. ఒక అరనిమిషం అవస్థపడ్డాం అలాగ. దీపాలు మళ్ళీ వెలిగినై. 'అమ్మయ్య' అని ఊపిరి తీసుకున్నాం.

### చీకటిలో భజన

మేము నిలబడిఉన్న చోటుకు దక్షిణంగా కొంచెము దూరాన ఒక పందిరి కనిపిస్తూనే ఉంది. అక్కడినుండి భజన కలకలం వినబడుతూనే ఉంది. దీపాలారినప్పుడు కూడా భజన ఆగినట్టు లేదు. ఎవరబ్బా! చీకటికూడా లెక్కచేయకుండా, భక్తిపారవశ్యంలో నిమగ్నులై, భజనతత్పరులై ఉన్న ఆ మహాత్ములు! ఒకసారి వెళ్ళి ఆపుణ్యపురుషుల దర్శనం చేసుకుందాం. ఇప్పుడప్పుడే గదికివెళ్ళి ఏమిచేస్తాం గనక? అనితలచి పందిరివేపు అడుగుల్ని తిప్పాము నలుగురమున్నూ.

కాని వెనకనించి ఒక స్త్రీ రోదనధ్వనివినబడటంచేత అడుగులు ముందుకు సాగలేదు. ఆ యిల్లాలు ఎవరో, పాపం, పెద్దపెట్టున ఏడుస్తోంది. ఏడుస్తూనే మధ్య మధ్యన జారవిడుస్తోన్న మాటల్నిబట్టి ఆమె మెడలో బంగారపుగొలుసు ఎవరో కత్తిరించుకు పోయాడన్నసంగతి తెలుస్తోంది. బహుశః ఆదొంగతనం దీపాలు ఆరిపోయినప్పుడు జరిగి ఉంటుందని ఊహించాను.

### గొలుసుపోయింది

'అంతే కావాలి, ఆదొంగ ఎవరో మంచిబుద్ధిచెప్పాడు. లేకపోతే ఈ అమ్మగార్లందర్నీ ఈ సింగారింపులతో, ఇక్కడేమో మించి పోతోందని ఎవరు రమ్మన్నారు? ఇళ్ళకు తాళాలుపెట్టడం; దుడదుడా ఇక్కడికొచ్చి జొరబడడం. అక్కడ భర్తలు ఇళ్ళకు వచ్చి తాళాలుచూచి తిరిగిపోతూండటం; లేకపోతే బజార్లో వీళ్ళకోసం కనిపెట్టుకుని దేవుడాఅంటూ ఆకలిమంటతో పచార్లుచేస్తూ ఉండటమూ. ఏం? వీళ్లంతా ఈభజనలకూ, పురాణాలకూ రాకపోతే? ఏదేవుడేడ్చాడట? బలే శాస్తిచేశాడు. నామనసుకు నచ్చినదొంగ వాడెవడో' అంటూ రామారావు తన గుండెలోని ఉద్దేశాల్ని బయటపెట్టాడు. విశ్వనాథంమాత్రం ఆయేడుస్తోన్న యువతికేసి జాలిగా చూస్తూ నిల్చున్నాడు. 'పాపం, గొలుసు చాల విలువైనదై ఉండాలి; ఇవాళ భర్తచేత ఈమెకు చీవాట్లు నైన్న గాబోలు' అన్నాడు.

### నేరస్థుడు కళావేత్త

రామారావు అందుకుని 'విశ్వం! నీవింకా జాంబవంతుడి కాలంనాటి ఉద్దేశాలను మార్చుకోవేం? భర్తచేత చీవాట్లుతినే ఆడది ఎవరయ్యా ఈరోజుల్లో. మొగుణ్ణి తిట్టి, కొట్టకపోతే పదివేలనుకో. నీకు పెండ్లయితేనేగాని సంగతి సందర్భాలు బాగా తెలిసిరావు. అసలు నీకేసంగతీ అనుభవంలోకి రానిదే అర్థంకాదుగా? సైకిలుతొక్కడం నేర్చుకుని, మోకాళ్లు విరగపడే వరకూ నీకు బెజవాడరోడ్లు ఎగుడు దిగుడుగా ఉంటాయని తెలిసిందీ?' అంటూ విశ్వనాథం స్వభావాన్ని వ్యాఖ్యానించడంలోకి దిగాడు.

గుంపులో కలకలం ఎక్కువైపోయింది. ఏవంకచూచినా జరిగిన దొంగతనాన్నిగూర్చిన ప్రశంసే. కొంతమంది అపరాధ పరిశోధకులు తయారయ్యారు అప్పుడే. మాపిలక శాస్త్రికూడా 'పాంచకడీదేవ్', 'షెర్లక్ హోమ్స్' మొదలైన సుప్రసిద్ధ డిటెక్టివ్ నవలాకారుల ఆంధ్రానువాదాల్ని చదివి నేర్చుకున్న కౌశల్యాన్ని వినియోగించే అవకాశం దొరికింది కదా అని పని కల్పించుకున్నాడు. కాని, అపరాధ పరిశోధకుడు విమర్శకుడు మాత్రమే; నేరస్థుడు కళావేత్త. ఆదొంగ ఎవరో ఈవిమర్శకుల కందరికీ అందని గొప్ప కళాభిజ్ఞుడై ఉండాలి. దొంగ దొరకలేదు.

## గుడిలో దొంగలున్నారు

పాపం, గొలుసు పోగొట్టుకున్న ఆబిడ చాల దుఃఖాక్రాంతయై, మనస్సు నిరాశచేసుకు దేవాలయం నుంచి నిర్గమించింది. రైలుస్టేషన్లలో, రైలుడబ్బాలలో రాసి ఉన్నట్టుగా దేవాలయాల్లోకూడా 'దొంగలున్నారు జాగ్రత!' అనే హెచ్చరిక ప్రకటించవలసిన ఆవశ్యకత దేవాలయాల ధర్మకర్తలెప్పుడు గుర్తెరుగుతారా అని నాలో ఆందోళన బైలుదేరిందప్పుడు.

ఇలాంటి ఉత్సవసమయాల్లో మోహాకాంతౌజ్వాలలకు ఇంధనాలు; చోరశిఖామణులకు విహారభూములు; మామూలు రోజుల్లో గిరీశం, వెంకటేశంలాంటి వాళ్లు ఉబుసుపోకకువచ్చి చుట్టలు తగలేసుకుని వెళ్ళే మరుగుచోట్లు; సాధులు విశ్రాంతిగా కూచుని అరమోడ్పు కన్నులతో గంజాయిదమ్ము పీలుస్తూ మత్తిల్లి ఉండే మఠాలు; తలిదండ్రులకు తెలియకుండా పిల్లలు వచ్చి చీట్లాడుకుంటూఉండే చోట్లు; సదా పూజారుల ప్రేమవిహారోద్యానాలు అయిన దేవాలయాల్లోనికి హరిజనులకుకూడా ప్రవేశము సంపాదించి పెట్టాలని దేశనాయకులు చేస్తోన్న ఆందోళన నాకు అర్థం కాకుండాఉంది. దేవాలయాలవల్ల ఉపయోగం ఎంతవరకు! 'బాలబాలికలు గుళ్ళల్లోకి వెళ్ళడం అంతతప్పుకాదు; కాని పెద్దవాళ్లైకూడా వెళ్లుతున్నారంటే అది క్షమార్హముకాని పని' అని చెబుతాడు వివేకానందుడు. అంటే, మానవుని ఆధ్యాత్మికాభివృద్ధికి దేవాలయ మనసరముకాదనీ, అయితే ప్రథమసోపానము కావచ్చుననీ తేలుతున్నది. భగవన్నిర్మితమైన మానవశరీరమే సకలార్థ సాధనకరణమైన వుత్కృష్ట దేవాలయం. దాన్ని ప్రతివాడూ పరిశుభ్రము చేసుకుని అందులో భగవజ్జ్యోతిని ప్రతిష్ఠితముచేసి ఆరాధించుకోవాలి. దేవాలయానికి వెళ్ళడమంటే దృష్టిని స్వశరీరంలోనికి ప్రసరించడమే. కార్తికపౌర్ణమినాడు గుళ్లోకివెళ్ళి మనవాళ్లు చాలమంది తలా ఒకదీపాన్ని వెలిగించి వస్తారు. అర్థంలేదు ఆపనికి. అలా చేసినందువల్ల ఫలమూలేదు.

## జ్ఞానదీపం వెలిగించాలి

మానవుడు తనలో జ్ఞానదీపాన్ని వెలిగించుకోవాలి. ప్రథమంలో శ్రీకృష్ణపరమాత్మవలన నరుడికి వుపదేశింపబడి—తర్వాత బుద్ధభగవానుడిచేత అహింసాతత్వముతో మిళాయింపు గావింపబడి—ప్రస్తుతం గాంధిమహాత్ముని ఆచరణోద్బోధనలచేత ప్రపంచవ్యాప్తము కానున్న నిష్కామకర్మయోగాభ్యాసమే భగవత్సేవ. ఒకప్పుడు దేవాలయాలు కేవలం పూజామందిరాలే కాక, గొప్పవిద్యాసంస్థలుకూడ. ఒక్కొక్క దేవాలయం తరఫున ఒక్కొక్క పెద్ద గ్రంథాలయం వుండేది. అందుకనే వాటికా రోజుల్లో ఎంతో విలువ, ప్రాముఖ్యత వుండేవి. ఇప్పుడవి నిష్ప్రయోజనములైన రాతికట్టడాలుగా మిగిలివున్నై. అట్టివాటిల్లోకి మేముకూడా ఎందుకు రాకూడదు? వస్తాం. అని హరిజనులు మొండిపట్టు పట్టడం మూర్ఖం. అంతకంటే మూర్ఖం సనాతన పండితులు వాళ్ళను రానీయమని పట్టుపట్టడం. నిమ్నజాతులకు దేవాలయప్రవేశపుహక్కును చేకూర్చిపెట్టినంతమాత్రాన వాళ్లదుస్థితిని ఒక్క అంగుళంకూడా. తొలగించినవాళ్ళం కాలేము. వాళ్లు ఆకటికి అలమటించకుండా వుండే మార్గాలను వెదకాలి మొదట. విద్యాగంధాన్ని వెదజల్లాలి. ఆరోగ్యవిజ్ఞానాన్ని బోధించాలి. బలులివ్వడం, తాగడం మొదలైన దురాచారాల్ని నిర్మూలం చేయాలి. అంతే కాని—సనాతనులు రావద్దంటున్న వాళ్ళ గుళ్ళల్లోకి మన మసలే పోవద్దు. ఎలాగైనా జొరబడదాం అనే మొండిపట్టుతో మన పురోభివృద్ధికి ఆటంకం కల్పించుకోవద్దు. దేవాలయాల్లో ప్రస్తుతం ఏమీలేదు వట్టి మకిలి తప్ప—పూజారుల తాంత్రికం తప్ప...

## పురివిప్పిన నెమళ్లు

భజనపందిరి వద్దకు చేరుకున్నాం. ఏంభజన! మిన్ను ముట్టిపోతోంది. ఆ తాళాలు– ఆ చప్పట్లు– గొంతు పెకల్చుకుని వస్తోన్న ఆ

రాగాలాపనలు—ఏమని వర్ణించను ఆ కోలాహలాన్ని! ఒక రాక్షసరాజు అనుచరులతో కూడుకుని డప్పులతో, డమరుకాలతో భయంకరఘోరారణ్యములో క్రూరమృగాల్ని వేటాడుతోన్నప్పటి ఘటన మనోగోచరమయింది మాకప్పుడు. మద్దెల వాయించుతోన్న యాతని తల విసరుళ్ళలో మద్యపానపు మత్తు కొంతవరకు వ్యక్తమౌతూనే వుంది. ఫిడేలు మీటుతోన్న శ్రీవైష్ణవాచార్యులవారు కంటి చివరలనుంచి అటుకేసి పురివిప్పిన నెమళ్ళలాగు సమావేశమై వున్న ఆడంగుల వేపు జంకుచూపులు చూస్తున్నాడు. పాడుతూ తాళంకొడుతూన్న భజనపరులలో కొంతమంది కన్నులరమోడ్చి, పక్కలకు ఊగుతూ ఆనందపరవశత్వాన్ని నటించుతున్నారు—చూచేవాళ్ళు తమను మహాభక్తులనుకోవాలని. చూడవచ్చిన వారిలోకూడ అట్టి నటన అక్కడక్కడ కనబడుతూనేవుంది.

## హరిదాసు ప్రత్యేకత

భజనపరులలో మధ్యగా కూర్చున్న ఒకాయనమాత్రం పట్టువస్త్రధారణచేశా, అందరికన్న ఎక్కువగా ఊగుతున్నందునా, మెడలోని ఒకపూలదండ వలనా, ప్రత్యేకత సంపాదించుకో గలిగేడు. ఆయన్ను హరిదాసు అంటారనీ, మహాభక్తుడనీ, వీధుల్లో నడచి వెళుతోన్న సమయాల్లోకూడా అప్పుడప్పుడు భక్తి పారవశ్యంచేత అమాంతంగా కింద పడిపోతోంటాడనీ, అలాగ ఆయన ఒడలిమీది తగిలిన అసంఖ్యాకములైన గాయాల మచ్చలు ఆయన భక్తికి ప్రబలనిదర్శనాలనీ—ఇలాంటి విషయాలు మాపక్కన నిలబడివున్న కొంతమంది ప్రజల సంభాషణను బట్టి తెలుసుకున్నాం.

వుండండి! ఏమిటది తాళాలు, చప్పట్లు—అన్నీ ఒక్కసారిగా ఆగిపోయినవేం? మద్దెలవాడు నిశ్చేష్టుడై అలాగ వెర్రిచూపులు చూస్తున్నాడేం? ఫిడేలుమీది కమానుచలనం లేకుండా ఆశ్చర్య పడుతుంది దేనికి? ఎక్కడ చూచినా నిస్తబ్ధతా, గాభరా,

## దేవుడు పూనాడు

ఏమిటి ఈహఠాత్-వైపరీత్యానికి కారణం? ఏమీ లేదు- హరిదాసు నిజశరీరాన్ని ముందుకూ, వెనక్కూ ఊపడం ఎక్కువ చేశాడు. పాడుతూ, పాడుతూ వున్నవాడల్లా వికృతంగా మూల్గడం ఆరంభించాడు. ఆమూల్గుడుకు ఆది, అంతం లేకుండా వుంది.

ఆ ప్రదేశమంతా ఒక నిమిషంసేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది. తరువాత వృద్ధ వితంతువులలో బైలుదేరి గుసగుసలు గుడి అంతా వ్యాపించినై. ఆగుసగుసల ఫలితంగా అనుభవజ్ఞుల మనుకున్న వాళ్ళు కొందరు లేచి "ఆ మహాత్ముడికి ఒడలు పూనింది. ఏమి అపరాధంజరిగిందో మరి భగవంతుడికి! శీఘ్రం ధూపంవేసి ప్రశ్నించండి" అని సలహాలు కుమ్మరించారు.

ధూపాలు వేశారు; చెంపలు వాయించుకున్నారు; మావల్ల ఏమి అపరాధం జరిగింది మహాప్రభూ! చెప్పమన్నారు. అప్పుడు హరిదాసు చంటిపిల్లలు జడుసుకునేలాగు గొంతు హాలాయించి, గుడ్లురిమి చూస్తూ చెప్పాడు: తాను భగవంతుడననీ, తనకు ఆహారం చాలడంలేదనీ, మర్నాడునుంచీ గుళ్ళో వెయ్యిమందికి తక్కువ కాకుండా బ్రహ్మణులకు సమారాధన జరగాలనీ. ఇలాగే ఇంకా ఏమోచెప్పాడుగాని మాంకా గోలలో సరిగ్గా వినిపించలేదు.

## దేవుడికి ఆహారం చాలలేదు

పాపం! భగవంతుడికి ఆహారం చాల్లేదుట! ఆకలిమంట భరించలేక హరిదాసుద్వారా ప్రజలకు విజ్ఞాపన చేసుకోవలసినగతిపట్టింది. సర్వభువనపోషకుడు పొట్ట నిండలేదని వాపోతున్నాడు. నమ్మదగిన మాటేనా? కాని అక్కడి వారంతా నమ్మేరు. పండితులనబడేవారే హరిదాసుగారి ముందుకు వచ్చి "స్వామీ! శాంతించండి. వెయ్యి మందికి కాకపోతే రెండువేల మందికి భోజనాలు ఏర్పాటుచేస్తాం రేపటినుంచీ" అని అభయమిచ్చిన తర్వాత భగవంతుడు వెళ్ళిపోయాడు; హరిదాసు తిరిగి మన ప్రపంచంలోకి వచ్చాడు. వుత్సవాలు ముగిసేంతవరకూ ఇంట్లో పొయ్యి రాజనక్కర లేదుగదా అని సంతో

షించారు పరభోజనప్రియులైన ద్విజులు. అక్కడ వున్నకొంతమంది షావుకార్ల ముఖాల్లోమాత్రం రవంత కించ కనబడుతోంది ; రేపటినించి వెయ్యిమంది బ్రాహ్మణుల సమారాధనకూ అయేఖర్చు వాళ్ళ నెత్తిమీదనే గదా పడుతుంది!

బ్రాహ్మలకి సంతర్పణ

ఇలాగ భగవంతుడు ఒక మనిషిని ఆవేశించడమనే విషయం శుద్ధ అబద్ధమని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తాను నేను. కొంతమంది ఆ విధంగా నటిస్తారు, తాము మహాభక్తులని ప్రజలనుకోవాలని. మరి కొంతమంది ఒకానొక స్వప్రయోజనము కోసం అట్లు నాటకం ఆడతారు. వుదాహరణంగా— ఒక గృహస్థుకు కొడుకుపుట్టాడనుకోండి; భార్యకు తన తండ్రిపేరు పెట్టాలనీ, భర్తకు తనతండ్రిపేరు పెట్టుకోవాలని వుంటుంది. బ్రతిమాలిగాని, భయపెట్టిగాని తన యిచ్ఛ సాగించుకునే శక్తిలేదు భర్తకు. తనమాటే నెగ్గాలనే గడుసుది భార్య. ఏం చేస్తాడు ? బాలసారె మహోత్సవం జరుగుతోంటుంది ; నామకరణంవేళ సమీపిస్తుంది. అప్పుడు హఠాత్తుగా గృహస్థుకు కళ్ళవెంట నీళ్లు వెల్లువలుగా ప్రవహిస్తై; ఒడలంతా వొణికిపోతూ వుంటుంది; ఒక మూల్గుడు బైలుదేరుతుంది. చివరకు ఏమి తేలుతుందంటే — సత్యనారాయణస్వామి ఆయన్ను ఆవేశించి, కుర్రవాడు తన ప్రసాదంవల్ల పుట్టినవాడు కావడంవల్ల తన పేరు పెట్టుకోవలసిందని చెప్పి, అలా పెట్టుకోకపోతే తనకు కోపం వస్తుందని బెదరించి వెళ్ళిపోతాడు. ఈతంత్రంతో భార్య లొంగిపోతుంది ; కుర్రవాడికి సత్యనారాయణ అనే పేరు పెట్టడానికి ఒప్పుకుంటుంది. భర్త లోలోపల సంతోషిస్తాడు, తన తండ్రి పేరు కుర్రాడికి వుంచగలిగేను గదా అని.

మనోమయ ప్రపంచం

మరొకరకం మనుష్యులు — అంటే శారీరకంగాను, మానసికంగాను దుర్బలులూ; వొడలు మరచి పడిపోవడమే భక్తికి పరమావధి అనుకునేవారూ కొందరున్నారు. వీళ్ళకు ఇలాంటి భజన సమయాల్లో—వట్టి వుద్రేకులు కావడంచేత— శరీరస్మృతి నిజంగానే తప్పిపోతుంది. తప్పిపోయి కామమయి మనోమయ ప్రపంచాల్లోకి వొకచూపు చూడగలుగుతారు. కాని భౌతికశరీరం అవశమై వున్నందుచేత వాళ్ళకా ప్రపంచాల్లో కలిగే అనుభవాలు సంపూర్ణంగా, విశదంగా వుండక మామూలు ప్రజలకు వచ్చే కలలవలె మధ్యమధ్య తెగిపోతూ, అవక తవకగా, మెళుకువ వచ్చాక సగం మరుపు తగిలేటటువంటివిగా, దురవగాహంగా వుంటై. భౌతిక శరీరం స్వవశంలో వుంటేతప్ప కామమయ మనోమయ ప్రపంచాల్లో కనిపించే దృశ్యాలూ, వినిపించే శబ్దాలూ మేదస్సులో అంకితమైన మనకు పూర్తిగా అవగాహనకావు. విస్మృతిలోవుండి వొడలు పూనిందని చెప్పేమాటలన్నీ పిచ్చివాళ్ళ వాగుడువలె, గుణం పుట్టినవాళ్ళ ప్రలాపాలవలె వుంటవి. కాబట్టి ఆఖరుకు భగవత్తత్వము అనుభవము కావలసి వచ్చినా అది భౌతికశరీరముగానే కావాలి. విస్మృతికాదు మనం కోరుకోవలసినది; సర్వాంకషమై మొక్కవోని ప్రజ్ఞ—నిద్రలోకూడా జాగ్రదవస్థ కావాలి మనకు......

................

ఇలాగ ఏమేమో భావాలు గది చేరుకున్నా నన్ను విడిచిపెట్టలేదు. నిద్రపోయినా అవే ఆలోచనలు.

---

౧౯-వ పేజీ తరువాయి]

# ఆవేదన

నిట్టూర్పు పుచ్చుతూ కూచున్ననాకు- అవగాహన కాలేదు- ఏమిటో మరి ఆప్రకృతి ఆవేదన!

... ... ...

“యేరా!- అలావున్నావేం?” అంటూ—వీపును తట్టాడు, నారాయణ !

యేముందిరా ?- అంటూ కళ్ళల్లోకి కాంతిని తెచ్చుకొని- కొద్దిగ కదిలా,- అవతలకు.

కూర్చుంటూ, “మీబావమరిది ‘సుబ్బారావు’ చనిపోయాడు” అని- టెలిగ్రాం కాగితం తీసి చూపాడు.

... ... ...

తెల్లపోయి, చూస్తూ- స్థంబించిపోయాను అలానే!—